సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023

I



పది వారాలుగా పైసల్లేవ్!
జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు పది వారాలుగా వేతనాలు అందడం లేదు. దీంతో కనీస అవసరాలు తీరక ఇబ్బంది పడుతున్నారు.
IVలో



లాభాల బాటలో ఆర్టీసీ
ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోలు గతేడాదితో పోలిస్తే నష్టాలను అధిగమించి ఈ ఏడాది రూ.7.82 కోట్ల లాభాలు సాధించాయి.
IVలో



వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగానే ఉంటుంది. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ప్యారాచూట్ నేతలపై ఫైర్
ఇల్లెందు కాంగ్రెస్‌లో ముసలం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రికొత్తగూడెం: కాంగ్రెస్ పార్టీలో ప్యారాచూట్ నేతలకు ప్రాధాన్యత ఇవ్వడమేంటని ప్రశ్నిస్తూ ఇల్లెందు కాంగ్రెస్ నేతలు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యకు ఇల్లెందు టిక్కెట్ కేటాయిస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న తమను కాదని కోరంకు టికెట్ ఇవ్వడం వల్ల పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని చెబుతున్నారు. ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి కాకుండా గతం నుంచి పార్టీని నమ్ముకున్న వారికే టికెట్ ఇవ్వాలనే డిమాండ్‌తో ఐదు మండలాలకు చెందిన నేతలు సమావేశమవుతున్నారు. అక్కడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున తీర్మానం చేసి హైకమాండ్‌కు పంపుతామంటున్నారు అసమ్మతి నేతలు.

డ్రాఫ్ట్ బాక్స్‌ను క్లియర్ చేయాలి



యూ డైస్ వివరాలు పరిశీలిస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: డ్రాఫ్ట్ బాక్స్‌ను వెంటనే క్లియర్ చేయాలని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. యూ డైస్ పరిశీలనలో భాగంగా కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ ఎంఈఓ కార్యాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. డ్రాఫ్ట్ బాక్స్ క్లియర్‌కు ఎలాంటి ప్రణాళిక సిద్ధం చేశారని ఎంఐఎస్, సీసీఓ, సీఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూ డైస్ పోర్టల్‌ను కంప్యూటర్‌లో ఓపెన్ చేసి అందులోని పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్‌ను పరిశీలించారు. పాఠశాలల్లో ఉన్న విద్యార్థులంతా యూ డైస్‌లో నమోదయ్యేలా చూడాలని ఎంఈఓలను ఆదేశించారు.

ట్రబుల్స్‌లో షూటర్

ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా వద్దిరాజు

- రెండుచోట్లా చాపకింద నీరులా విస్తరిస్తున్న అసమ్మతి
- చల్లార్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న ఎంపీ
- త్వరలో ఇల్లెందు, కొత్తగూడెంలో కేసీఆర్ టూర్
- పర్యటన నాటికి పరిస్థితులు చక్కదిద్దేందుకు యత్నాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారత రాష్ట్ర సమితి పార్టీలో నయా ట్రబుల్ షూటర్‌గా దూసుకుపోతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పీడ్‌కు బ్రేకులు పడుతున్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా రంగప్రవేశం చేసిన ఆయన అనతి కాలంలోనే జిల్లా రాజకీయాలపై ముద్ర వేశారు. అసమ్మతి నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ పరిస్థితిని చక్కదిద్దారనే భావన కలిగించారు. అయితే ఆ ఆనందం కొద్దిసేపే మిగిలింది. పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోందనే ఆందోళన పార్టీలో నెలకొంది.

వద్దిరాజు రంగప్రవేశంతో..
గ్రూప్ రాజకీయాలు, అసమ్మతి కొట్లాటతో నిండిపోయిన కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌గా గత ఆగస్టులో వద్దిరాజు రవిచంద్రను ప్రత్యేకంగా సీఎం కేసీఆర్ పంపించారు. ఆయన వచ్చీ రావడంతోనే మెరుపు వేగంతో రంగంలోకి దిగారు. రెండు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తూ అందరినీ కలుపుకుపోయారు. వద్దిరాజు ఎంట్రీతో కొత్తగూడెంలో గ్రూప్ రాజకీయాలు సద్దుమణిగాయి. ఇల్లెందులోనూ అసమ్మతి వర్గం నేతలను బుజ్జగించడంతో పాటు తమ సమస్యలు చెప్పుకునేందుకు మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో సమావేశాలు ఏర్పాటు చేయించారు. మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత నియోజకవర్గంలో యాక్టివ్ అయ్యేలా చూశారు. బీ ఫామ్‌ల పంపిణీ సమయానికి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి కంట్రోల్‌లోకి వచ్చిందనే భావన కలిగించారు.

గెలుపే లక్ష్యంగా పావులు..
ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా రవిచంద్ర పావులు కదుపుతూ ఎమ్మెల్యేలు, పార్టీ పరంగా అసంతృప్తిగా ఉన్న మున్సిపల్ కౌన్సిలర్లతో రెండో విడత చర్చలు ప్రారంభించారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ సందర్భంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు. ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వస్తే భవిష్యత్‌లో మంచి పదవులు ఇస్తామని, ఆర్థికంగా అండగా ఉంటామని భరోసా కల్పించే ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. దీనికి కొందరు అంగీకారం తెలపగా మరికొందరు మౌనంగా సమావేశం నుంచి నిష్క్రమించినట్టు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న వారి కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా చాలా కష్టనష్టాలు ఎదుర్కొన్నామని, ఇప్పుడు అరకొర సాయం, ఉత్త హామీలతో తమకు ఒరిగే లాభం ఏమీ లేదనే అభిప్రాయంతో ఉన్నట్టు సమాచారం. రాబోయే రోజుల్లో జరగబోయే పరిణామాలను బట్టి తమ రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుంటామని ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. మరోవైపు కౌన్సిలర్లు, సర్పంచ్.. ఇలా ప్రజాప్రతినిధులతోనే సంప్రదింపులు చేస్తున్నారు తప్పితే, తమను పట్టించుకోవడం లేదని పార్టీ పదవుల్లో కొనసాగుతున్న నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సీఎం పర్యటనకు ముందు..
సీఎం పర్యటనకు ముందు పరిస్థితులు చక్కబడ్డాయనే భావన నెలకొన్న సమయంలో అనూహ్యంగా ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం మండలంలో ఇద్దరు ఎంపీటీసీలు, తొమ్మిది మంది సర్పంచ్‌లు, ఐదుగురు సింగిల్ విండో డైరెక్టర్లు, ఆరుగురు ఉప సర్పంచ్‌లు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహా పరిస్థితులు రెండు నియోజకవర్గాల్లో చాపకింద నీరులా క్రమంగా వ్యాపిస్తున్నాయి. గార్ల మండలంలో బీఆర్‌ఎస్‌ను వీడేందుకు అక్కడి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు గురువారం రంగం సిద్ధం చేశారు. దీంతో వద్దిరాజు రవిచంద్ర గార్లకు చేరుకుని అక్కడి నాయకులను సముదాయించే పనిలో పడ్డారు. ప్రజాశీర్వాద సభల నాటికి పార్టీ పరంగా అన్ని విషయాలను కొలిక్కి తేవడం వద్దిరాజుకు సవాల్‌గా మారిందనే చర్చ జరుగుతోంది.

రెండు చోట్లా గ్రూపు రాజకీయాలు..
జిల్లాలోని ఏకైక జనరల్ స్థానమైన కొత్తగూడెంలో ఏడాది కిందట మూడు గ్రూపులు ఆరు వర్గాలు అన్నట్టుగా బీఆర్‌ఎస్ పరిస్థితి ఉండేది. సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వర్గానికి, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు వర్గానికి పోటీ నెలకొని ఉండేది. మధ్యలో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు కొత్తగూడెంలో వరుసగా పర్యటిస్తూ పొలిటికల్ హీట్‌ను మరింత పెంచారు. నేరుగా వనమాను టార్గెట్ చేసుకుని కామెంట్లు చేస్తూ వచ్చారు. ఈ వర్గపోరు కొనసాగుతుండగానే వనమా ఎన్నికల చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో పార్టీలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఇల్లెందులో మున్సిపాలిటీ నుంచి మొదలైన ముసలం చివరకు నియోజకవర్గం అంతా వ్యాపించింది. సమస్యను చక్కదిద్దేందుకు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు, తాతా మధు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చివరకు అసమ్మతి వర్గమంతా ఏకమై సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దంటూ బహిరంగంగా ప్రకటన చేశారు.

మాకు మర్యాద లేదు



కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్లు, వనమా మద్దతుదారుల మధ్య వాగ్వాదం

వద్దిరాజు రవిచంద్ర కొత్తగూడెం పర్యటన ముగించుకుని వెళ్లిన తర్వాత స్థానిక మున్సిపాలిటీలో అసమ్మతి వర్గం భగ్గుమంది. ఇక్కడ 25 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉండగా 21 మంది గురువారం రాత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్ బహిష్కృత నేత, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు రాఘవ తమపై అజమాయిషీ చెలాయిస్తూ, అకారణంగా తిడుతున్నాడంటూ ఆరోపణలు చేశారు. రాబోయే ఎన్నికల్లో రాఘవ నుంచిరక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్‌తో తాము కూడా సమావేశం అయ్యేలా చూడాలని రవిచంద్రను కోరారు. సమావేశం జరుగుతుండగానే వనమా మద్దతుదారులుగా ఉన్న జేవీఎస్ చౌదరి, కాసుల వెంకట్ అక్కడికి చేరుకున్నారు. ఈ సమయంలో అసమ్మతి గళం వినిపించడం సరికాదంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. కౌన్సిలర్ల సమావేశంపై కొన్ని చానళ్లు, సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని, కౌన్సిలర్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారే తప్ప గొడవ జరగలేదని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తాను అందరితోనూ మాట్లాడానని, వారంతా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని, కొత్తగూడెంలో గులాబీ జెండా ఎగురవేసి సీఎంకు కానుకగా ఇస్తామని ప్రకటించారు.

సిరులు కురిపించే ధాన్యలక్ష్మి

రామాలయంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి వేడుకలు



ధాన్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం శ్రీ లక్ష్మీతాయారమ్మవారిని సిరులు కురిపించే ధాన్యలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివార్లకు స్నపన తిరుమంజనం చేశారు. మధ్యాహ్నం లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు కిష్కింధకాండ పారాయణం చేశారు.

నేడు విజయలక్ష్మిగా..
'జ్ఞానేశ్వరి..విజయ ప్రదా' అని కీర్తిస్తారు పరాశరభట్టర్. విజయం అంటే యుద్ధంలో గెలుపొందడం మాత్రమే కాదని, అన్ని రంగాలలో విజయం సాధించడమని పండితులు పేర్కొంటున్నారు. ఈ రూపంలో ఉన్న అమ్మను సేవిస్తే అన్ని రంగాల్లో సునిశత జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని, విజేయులను చేస్తుందని, అందుకే విజయలక్ష్మి అలంకారంలో లక్ష్మీతాయారమ్మవారు శుక్రవారం దర్శనం ఇస్తున్నారని పండితులు చెబుతున్నారు.

కమనీయంగా నిత్యకల్యాణం..
శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

శ్రీ మహాలక్ష్మిగా పెద్దమ్మతల్లి



శ్రీ మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారు

పాల్వంచరూరల్ : శ్రీదేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు గురువారం పెద్దమ్మతల్లి అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రాతఃకాలార్చన, వేద పారాయణం, నవగ్రహ జపాలు, శ్రీ సూక్తం, మన్యసూక్త పారాయణం, సప్తశతి పారాయణం, శ్రీచక్రార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు. కాగా, నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి ఆలయం నుంచి పలు దేవస్థానాలకు పసుపు, కుంకుమ, చీర, జాకెట్, కొబ్బరికాయలు, పండ్లు, పూలు, గాజులతో కూడిన సారెను సమర్పించారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

ఎస్పీ డాక్టర్ వినీత్



ఎస్పీ వినీత్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ నాగరాజు రెడ్డి

కొత్తగూడెంటౌన్: రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించి, శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన భాద్యత ప్రతి పోలీసుపై ఉందని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించొద్దని అన్నారు. ప్రతీ పౌరుడు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఓటర్లను నగదు, మద్యం ఇతర వస్తువులతో ప్రలోభపెట్టే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు ర్యాలీలు, సభలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 21 నుంచి 30 వరకు పోలీసు అమర వీరుల సంస్మరణ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాసరచన, ఆన్‌లైన్ ఓపెన్ హౌస్, ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ తదితర పోటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు వెంకటేష్, రమణమూర్తి, రాఘవేంద్రరావు, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా భద్రాచలం
భద్రాచలంఅర్బన్ : జిల్లాలో భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్ ఉత్తమ పీఎస్‌గా నిలిచింది. ఈ మేరకు ఎస్‌హెచ్‌ఓ నాగరాజురెడ్డికి ఎస్పీ వినీత్ తన కార్యాలయంలో గురువారం ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే జిల్లాలో ట్రాఫిక్ ఈ చాలన్ రియలైజేషన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన భద్రాచలం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాస్‌కు కూడా ప్రశంసాపత్రం అందించారు. అనంతరం ఏఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉత్తమంగా నిలిచి ఇతర స్టేషన్లకు ఆదర్శంగా నిలవడం హర్షణీయమని అన్నారు. సీఐ నాగరాజు రెడ్డి, ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను అభినందించారు.

ఆరు గ్యారంటీలు కావు.. అవాస్తవ హామీలు

ఎంపీలు నామ నాగేశ్వరరావు, పార్థసారధి రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ నామ, పక్కన పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యే మెచ్చా

చండ్రుగొండ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అందరూ కడుపునిండా అన్నం తింటున్నారని, దాన్ని వదులుకోవద్దని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి అన్నారు. మళ్లీ కేసీఆర్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. చండ్రుగొండలో గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. గతంలో తాగు, సాగునీటికి, విద్యుత్‌కు ఇబ్బందులు పడ్డామని, కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ ఆ రోజులు వస్తాయని అన్నారు. రాహుల్‌గాంధీ ఆచరణ సాధ్యం కాని హామీల స్క్రిప్టులు చదువుతున్నారని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అవాస్తవ హామీలని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్‌కు ప్రజా సంక్షేమంపైనే దృష్టి ఉంటుందని, బీఆర్‌ఎస్‌కు ఓటేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధికి సహకారం అందిస్తానని పార్థసారధి రెడ్డి హామీ ఇచ్చారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా
అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించానని, మరోమారు గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కాగా, చండ్రుగొండ జెడ్పీటీసీ, సీనియర్ కాంగ్రెస్ నేత కొడకండ్ల వెంకటరెడ్డి ఎంపీల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రైతుబంధు ఖమ్మం జిల్లా సమన్వయకర్త నల్లమల వెంకటేశ్వరరావు, నాయకులు దారా యుగంధర్, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దారా వెంకటేశ్వరరావు, ఎస్డీ రసూల్, ఉప్పతల ఏడుకొండలు, నల్లమోతు వెంకటనారాయణ, భూపతి శ్రీనివాసరావు, సూరా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గిరిజనేతలకు గృహలక్ష్మి అమలుపై హైకోర్టు స్టే'

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు గృహలక్ష్మి పథకం అమలుపై హైకోర్టు స్టే ఇచ్చిందని ఆదివాసీ సేన రాష్ట్ర నాయకుడు కొర్సా నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓతో అన్ని ప్రాంతాల్లోని ప్రజలకు గృహలక్ష్మి పథకం అందుతుందని అధికారులు చెప్పారన్నారు. లబ్ధిదారుల ఎంపిక పెసా గ్రామసభల ద్వారా జరగాల్సి ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా జరుగుతోందని, దీంతో హైకోర్టును ఆశ్రయించగా గిరిజనేతరులకు గృహలక్ష్మి పథకం అమలుపై స్టే విధించిందని వెల్లడించారు.

కొత్తగూడెం ఏరియాలో డీఎఫ్‌ఓ పర్యటన



మ్యాప్ ద్వారా సేఫ్టీజోన్‌ను పరిశీలిస్తున్న కృష్ణాగౌడ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి జీకేటీసీలోని సేఫ్టీజోన్‌లో గురువారం డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ జి.కృష్ణాగౌడ్, సిబ్బంది పర్యటించారు. ఈసందర్భంగా జీకేటీసీలో ఉన్న 7.5 మీటర్ల సేఫ్టీజోన్‌ను పరిశీలించారు. అనంతరం జీఎం శాలేంరాజుతో జోన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం కోటిరెడ్డి, జీకేటీసీ పీఓ శ్రీరమేశ్, ఏరియా సర్వే ఆఫీసర్ సదానందం, ఫారెస్ట్ డీజీఎం హరినారాయణతోపాటు తావుర్యా, యు.కోటేశ్వరరావు, ఉమ, మురళి, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒంటరిగానైనా పోటీ చేస్తాం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

చర్ల: భద్రాచలం నియోజకవర్గంలో సీపీఎం ఒంటరిగానైనా పోటీ చేస్తుందని, నిత్యం ప్రజల మధ్యనే ఉండి నీతి, నిజాయితీగా పనిచేస్తున్న సీపీఎంను శాసనసభ ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రంలోని బీఎస్‌రామయ్యభవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని, చర్చలు విఫలమైతే ఒంటరిగానైనా పోటీ చేసేందుకు సీపీఎం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అవకాశవాద రాజకీయాలు చేసే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మచారి, జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి కారం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు పరీక్షకు 86 మంది



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ రాత పరీక్షకు రెండోరోజు గురువారం 86 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 135 మందికి గాను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో 86 మంది చొప్పున హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

బాలికపై యువకుడి అత్యాచారయత్నం

పోలీసులకు ఫిర్యాదుతో పురుగుల మందు తాగిన వైనం

తిరుమలాయపాలెం: ఒంటరిగా ఉన్న బాలికపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఘటనపై బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన అశోక్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో పారిపోయాడు. ఈ విషయం తెలిసిన అశోక్‌ను బుధవారం కుటుంబీకులు మందలించడంతో తిరిగి వచ్చి బాలిక కుటుంబీకులను దుర్భాషలాడినట్లు తెలిసింది. దీంతో బాలిక తల్లి సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఆందోళనకు గురైన అశోక్ గురువారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

ఆఫర్ల మోజులో మోసపోవద్దు..

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత తప్పనిసరి

- తప్పుడు ప్రచారాలను నమ్మితే సొమ్ము ఖతం..
- సైబర్ మోసాల బారిన పడితే వెంటనే ఫిర్యాదు చేస్తే ఫలితం



కొత్తగూడెంటౌన్: ఎక్కడ చూసినా బతుకమ్మ సందడి నెలకొంది. ఇదే అదునుగా వివిధ కంపెనీలు, ఆన్‌లైన్ సైట్లు తమ ఉత్పత్తుల అమ్మకంపై ఆఫర్లు ప్రకటించాయి. పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం హోరెత్తిస్తున్నాయి. ఇంతలోనే సైబర్ నేరగాళ్లు సైతం కాచుకుని ఉన్నారు. ప్రధాన సంస్థలను పోలినట్లుగా ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రజల సొమ్మును స్వాహా చేయాలని యత్నిస్తారు. ఫలానా వస్తువు తక్కువ ధరకే ఇస్తాం.. ఒకటి కొంటే ఇంకొకటి ఉచితం అన్నట్లుగా వ్యాపార సంస్థల ప్రకటనలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి తప్పుడు లింక్‌లతో పంపిస్తారు. కంపెనీ అసలైనదేనా.. నకిలీదా అని ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకోకపోతే మాత్రం పండుగ వేళ సొమ్ము కోల్పోయి గొల్లుమనాల్సి వస్తుంది. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

యాప్‌లు, లింక్‌లతో జాగ్రత్త

ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేటప్పుడు ఈ – కామర్స్, అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సైట్లను ఎంచుకుంటారు. అయితే, అసలును పోలిన నకిలీ యాప్‌లు, లింక్‌లు వస్తున్నందున అవి సరైనవేనా అని నిర్ధారించుకున్నాక డబ్బులు చెల్లించడం మంచిది. అలాగే, సెల్‌ఫోన్‌కు వచ్చే లింక్‌లు, మెసేజ్‌లకు స్పందించకపోవడమే ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. అంతే కాక ఎవరు ఫోన్ చేసినా క్రెడిట్‌కార్డు వివరాలు, ఓటీపీలు చెప్పొద్దని సూచిస్తున్నారు.

సైబర్ నేరాల తీరు..

బ్యాంకు నుంచి ఫోన్ చేసినట్లుగా నమ్మబలికి ఓటీపీలు అడగడం ఇటీవల ఎక్కువైంది. నిజమేనని నమ్మి నంబర్ చెబితే ఖాతాల్లోని సొమ్మును క్షణాల్లో స్వాహా చేస్తున్నారు. అలాగే, ఏటీఎం కార్డు కాలపరిమితి తీరిందని కూడా మోసగించేందుకు పలువురు యత్నిస్తున్నారు. ఇక ఫోన్‌లకు, ఫేస్‌బుక్, వాట్సాప్‌కు తప్పుడు లింక్‌లు పంపించి నగదు స్వాహా చేసే అవకాశమున్నందున స్పందించకుండా జాగ్రత్త పడాలి.

ఈ జాగ్రత్తలు పాటించండి..

గుర్తు తెలియని లింక్‌లు వస్తే ఓపెన్ చేయొద్దు. మనకు సంబంధం లేకుండా మెసేజ్ వచ్చిందంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. ఏటీఎం కార్డుల పాస్‌వర్డ్‌లు తరచుగా మార్చుకోవాలి. ఖాతాలో లావాదేవీలను ఎప్పటికప్పుడు చూసుకుంటే నగదు నిల్వ వివరాలు తెలుసుకోవచ్చు. ఏటీఎం పిన్ ఎవరికీ చెప్పొద్దు. అనుమానాస్పద యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవద్దు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే సమయాన అన్నీ పరిశీలించాలి. లాటరీ గెలిచారని వచ్చే ఫోన్లకు స్పందించవద్దు.

మోసపోతే..

సైబర్ నేరాల బారిన పడితే 24 గంటలలోపు సైబర్ సెంటర్ నంబర్ 1930కు కానీ డయల్ 100కు గానీ ఫోన్ చేయాలి. ఈ సమయాన పూర్తి వివవాలను పోలీసులకు సమర్పించాల్సి ఉంటుంది.

వ్యక్తిగత వివరాలు ఎప్పుడూ అడగం..



సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్న నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏ బ్యాంకు నుంచి కూడా ఫోన్ చేసి ఓటీపీ వంటి వివరాలు అడగరు. ఈ విషయాన్ని గుర్తించి ఎవరితో వివరాలు పంచుకోవద్దు. బ్యాంకు ఖాతా నంబర్, ఏటీఎం నంబర్ చెప్పి మోసపోవద్దు.

–కొండూరి సుధీర్, ఏపీజీవీబీ సీనియర్ మేనేజర్, కొత్తగూడెం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



తప్పుడు ఫోన్లకు, మెసేజ్‌లకు స్పందించవద్దు. అనుమానాస్పదంగా మాట్లాడితే ఏ వివరాలు కూడా చెప్పొద్దు. సైబర్ నేరాల బారిన పడి డబ్బు కోల్పోతే 24 గంటల్లోగా సైబర్ క్రైం నంబర్ 1930కు కానీ డయల్ 100కు కానీ ఫోన్ చేసి అన్ని ఆధారాలు సమర్పించాలి.

–అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ, కొత్తగూడెం

తెల్లం గెలుపుతోనే భద్రాద్రి అభివృద్ధి..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

దుమ్ముగూడెం: బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు విజయంతోనే భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ తాతా మధు తెలిపారు. గురువారం మహదేవపురం గ్రామంలో నిర్వహించిన మండల చర్చి పాస్టర్ల ఐక్య వేదిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెల్లం వెంకట్రావుతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలించే రాష్ట్రాల్లో ఆరు గ్యారెంటీలు ఎందుకు అమల్లో లేవని ప్రశ్నించారు. భద్రాచలంలో ఇంతకుముందు గెలిచిన అభ్యర్థులతో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఒక్కసారి బీఆర్‌ఎస్ అభ్యర్థికి అవకాశం కల్పిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తామని తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానీపాషా, జెడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం..

చర్లరూరల్: రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యమని ఎమ్మెల్సీ తాతా మధు ధీమా వ్యక్తం చేశారు. గురువారం చర్ల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. భద్రాచలం పార్టీ అభ్యర్థి తెల్లం వెంకట్రావును అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సోయం రాజారావు, లంకరాజు, కోదండ రామయ్య, కొటేరు శ్రీనివాసరెడ్డి, యస్‌డీ అజీజ్, దొడ్డి తాతారావు, కాకి అనిల్, ఆలం ఈశ్వర్, బోళ్ల వినోద్, రామగిరి అరుణ్, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి టు శబరిమలై..

నలుగురు అయ్యప్ప మాలధారుల పాదయాత్ర షురూ



మాలధారుల పాదయాత్రను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: టేకులపల్లికి చెందిన గురుస్వామి అంబాల బాలయ్య ఆధ్వర్యంలో నలుగురు అయ్యప్ప మాలధారులు శబరిమలైకి పాదయాత్ర చేపట్టారు. గురువారం టేకులపల్లికి చెందిన గురుస్వామి అంబాల బాలయ్య, స్వాములు గడ్డం నవీన్, వడ్లాల శ్రీనివాస్ (కరీంనగర్), గురుస్వామి భూక్య నాగు (కాచనపల్లి) టేకులపల్లిలోని రామాలయంలో అలగంజి ప్రదీప్‌శర్మ చేత ఇరుముడి కట్టించుకుని ప్రత్యేక పూజలు చేయగా.. యాత్రను జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ వైద్యుడు ఎస్‌కే పాషా స్వాములకు రేడియం జాకెట్లు అందించారు. బాలయ్య ఆధ్వర్యంలో గతంలోనూ రెండుసార్లు పాదయాత్ర, ఒకసారి బైక్‌యాత్ర ద్వారా శబరిమలైకి వెళ్లారు. టేకులపల్లి, కొత్తగూడెం, తిరువూరు, మైలవరం, విజయవాడ, గుంటూరు, చిలకలూరిపేట, నెల్లూరు, రెడ్‌హిల్స్, తిరుచ్చి, దండుగల్, కుమిలి, ఎరుమేలి మీదుగా పంబ సన్నిధానానికి చేరుకోనున్నారు. మొత్తం 41 రోజులు, నాలుగు రాష్ట్రాలు, 1,288 కిలోమీటర్ల మేర పాదయాత్ర ఉంటుందని మాలధారులు వెల్లడించారు.

తప్పించుకున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు

రైతులు వెంట పడడంతో కారు వదిలేసి పరారీ



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి: రైతులకు కంటి మీద కునుకు లేకుండా విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేస్తున్న ముఠా రెప్పపాటులో తప్పించుకుంది. రైతులు వెంట పడడంతో ఘటనా స్థలంలోనే కారు, సెల్‌ఫోన్, ట్రాన్స్‌ఫార్మర్లు విప్పడానికి ఉపయోగించే పరికరాలను వదిలేసి పారిపోయారు. నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్ల చోరీ జరుగుతుండడంతో రైతులు కాపలా కాస్తున్నారు. బుధవారం రాత్రి మోటాపురం ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు కారులో ముఠా సభ్యులు రాగా.. రైతులు గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీంతో అందరూ చేరుకునేలోగా దొంగలు పరుగులు తీయగా రైతులు వెంబడించినా ఫలితం దక్కలేదు. దొంగలు వచ్చి కారు, ఫోన్, చోరీ చేసేందుకు వాడే పరికరాలను వదిలేసి వెళ్లడంతో కూసుమంచి సీఐ జితేందర్, నేలకొండపల్లి ఎస్సై సతీష్ గురువారం ఉదయం మోటాపురం చేరుకుని వివరాలు ఆరా తీశారు. కారు, ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

మా కుమారుడిని కాపాడండి..

- ఆపన్నహస్తం కోసం ఓ నిరుపేద కుటుంబం వేడుకోలు
- మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 7వ తరగతి విద్యార్థి



హర్షిత్

దీనగాథ



ఆపన్నహస్తం అందించాలని కోరుతున్న హర్షిత్ తల్లిదండ్రులు

కారేపల్లి: మెదడులో నీరు చేరడంతో అనారోగ్యం పాలైన ఓ విద్యార్థి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన ఆ విద్యార్థి తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. బ్రెయిన్‌కు సర్జరీ చేస్తేనే బతుకుతాడని వైద్యులు సూచించడంతో కన్నీరుమున్నీరవుతున్న ఆ తల్లిదండ్రులు దాతల సాయం కోసం వేచిచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని గాదెపాడు గ్రామానికి చెందిన భూక్యా సంతు, ప్రమీల దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడైన భూక్యా హర్షిత్ కారేపల్లిలోని మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. కాగా మూడేళ్ల కిందట హర్షిత్‌కు జ్వరం రావడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చూపించగా.. చిన్నారి బ్రెయిన్‌లో నీరు చేరిందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో హర్షిత్‌కు రెండుసార్లు బ్రెయిన్ సర్జరీ జరిగి కోలుకుంటున్న క్రమంలో ఇటీవల తిరిగి అనారోగ్యానికి గురికావడంతో రెయిన్‌బోకు తీసుకొచ్చారు. చికిత్స అనంతరం మరోసారి బ్రెయిన్ సర్జరీ చేయాలని, సుమారు రూ.7 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో ఇప్పటికే ఇల్లు, వాకిలి అమ్ముకోవడంతో పాటు స్నేహితుల సహకారంతో రూ.12 లక్షల వరకు ఖర్చుచేశామని వాపోయారు. ఇదిలా ఉండగా హర్షిత్ తండ్రి సంతుకు 2021వ సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై బ్రెయిన్ సర్జరీ కావడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యాలతో రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించింది. తమ కుమారుడి ప్రాణాలైనా కాపాడుకుందామని, దాతలు సహకరించాలని హర్షిత్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

బీఆర్‌ఎస్ నేతపై పోక్సో కేసు

- బాలికపై అత్యాచారం
- పోలీసులకు బాధితురాలి తల్లి ఫిర్యాదు



బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుతో కందిమళ్ల సతీశ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల సమయంలో భద్రాచలంలో అధికార బీఆర్‌ఎస్‌కు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే కందిమళ్ల సతీశ్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పట్టణంలోని దిగువ చప్టా ప్రాంతానికి చెందిన సతీశ్ అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికను మాయమాటలతో లోబరుచుకుని స్థానికంగా ఓ లాడ్జీకి తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబసభ్యులు నేరుగా అక్కడికి వెళ్లి సతీశ్ చేస్తున్న మోసాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడే అతడికి దేహశుద్ధి చేశాక బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన కందిమళ్ల సతీశ్‌ను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఇప్పటికే సెటిల్‌మెంట్ సతీశ్‌గా భద్రాచలంలో అతడి అరాచకాలు పెరిగాయని ఆరోపించారు. గతంలో పెళ్లి చేసుకుని, ఆ మహిళ మరణానికి కారణమయ్యాడని, ఇలాంటి వారికి బీఆర్‌ఎస్ అండగా నిలవడం దారుణమని విమర్శించాయి.

పార్టీతో సంబంధం లేదు

ప్రైవేటు లాడ్జిలో బాలికతో ఉన్న సతీష్ బీఆర్‌ఎస్ యువజన నాయకుడని ఇతర పార్టీల వారు చెప్పడాన్ని తాము ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ భద్రాచలం మండల అధ్యక్షుడు అరికలె తిరుపతిరావు ప్రకటించారు. ఆయనకు బీఆర్‌ఎస్‌లో ఎలాంటి పదవీ లేదని, పార్టీతో సంబంధం లేదని అన్నారు. అయితే నిందితుడు సతీశ్ గతంలో బీఆర్‌ఎస్ పార్టీ నేతలతో కలిసి దిగిన ఫొటోలు, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న వీడియో క్లిప్పింగ్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటన భద్రాచలంలో రాజకీయ దుమారానికి కారణమైంది.

పోక్సో కేసు నమోదు చేశాం

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని భద్రాచలం సీఐ నాగరాజు తెలిపారు. బాలికకు మాయమాటలు చెప్పి లాడ్జీకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడంటూ బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని చెప్పారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చెంది న కొందరు యువకులు మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన మండవ రామాంజి అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రామాంజి తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల..

బూర్గంపాడు: సారపాకలోని ఓ పేకాట స్థావరంపై బుధవారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు రాజ్‌కుమార్, నాగభిక్షం సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని చిన్నారికి గాయాలు

దుమ్ముగూడెం: కారు ఢీకొని చిన్నారి గాయపడిన ఘటన గురువారం మండలంలోని చినబండిరేవు గ్రామశివారులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామం శివారులో చిన్నారి లోకేశ్వరి రోడ్డు దాటుతుండగా అతివేగంగా పర్ణశాల వైపు నుంచి భద్రాచలం వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. చిన్నారి తీవ్రంగా గాయపడగా డ్రైవర్ కారును ఆపకుండా వెళ్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారును లక్ష్మీనగరంలో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాయపడిన చిన్నారిని భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

మద్యం, డబ్బు సీజ్

దమ్మపేట: ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న మద్యం, డబ్బును అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని జలవాగు చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులకు రెండు వేర్వేరు ద్విచక్రవాహనాల్లో తరలిస్తున్న రూ.59,200 నగదుతోపాటు 15 క్వార్టర్ సీసాలు, 12 బీర్లు పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 10 లీటర్ల నాటుసారాను ఎస్‌ఐ కేశవరావు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తూరుబాక గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రూ.4,500 విలువైన మద్యం..

కామేపల్లి: మండలంలోని ముచ్చర్లలో కోలా దర్గయ్య నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో గురువారం మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సుమారు రూ.4,500 విలువైన 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని దర్గయ్యపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

దారి కోసం వేటకొడవళ్లతో దాడి

బాధితుడి పరిస్థితి విషమం




చికిత్స పొందుతున్న దయాకర్

పాల్వంచరూరల్: పొలం దారి విషయమై ఓ యువకుడిపై వేటకొడవళ్లతో దాడి చేసిన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన ఆడెపు దయాకర్ బుధవారం సాయంత్రం చేనులో పనులు ముగించుకుని కూలీలను తీసుకుని ట్రాక్టర్‌లో ఇంటికివస్తున్నాడు. మార్గ మధ్యలో పచ్చిపాల రాములు, అతడి కుమారుడు భాస్కర్ కలిసి ట్రాక్టర్‌ను ఆపి 'నీకు దారి ఎక్కడ ఉందిరా' అంటూ వాగ్వాదానికి దిగి వెంటతెచ్చుకున్న వేటకొడవళ్లతో దయాకర్‌పై దాడిచేశారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దాడి చేసినవారు పారిపోయారు. అడ్డుకోబోయిన దయాకర్ తల్లిని తోసివేయగా స్వల్పంగా గాయపడింది. దయాకర్‌ను తొలుత పాల్వంచ ఆస్పత్రికి అటు నుంచి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగ ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. దయాకర్ తల్లి ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన బాల్దా వెంకటేశ్వరరావు (55) మండలంలోని రాజాపురం గ్రామంలో తన బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని నామవరం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఇతడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు తలకు తీవ్ర గాయాలుగా 108లో సత్తుపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీ జ్వరంతో వైద్యురాలు మృతి



డాక్టర్ సుమ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన జూనియర్ డాక్టర్ సుమ (23) డెంగీ జ్వరంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. సుమ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ వైద్యశాలలో జూనియర్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారం రోజుల నుంచి డెంగీ జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమంగా మారి గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతదేహాన్ని హైదరబాద్ నుంచి సీతానగరం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సుమ మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆగిన ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

నేలకొండపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం బండలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాశిమళ్ల సంజయ్(38) నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని రైస్ మిల్లులో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం పని ముగిశాక ద్విచక్ర వాహనంపై ఆయన లక్ష్మీపురం బయలుదేరాడు. మార్గమధ్యలో సుర్దేపల్లి వద్ద ఓ రైతుకు చెందిన ట్రాక్టర్ రోడ్డుపై ఆగి ఉండగా దాన్ని ఢీకొట్టిన సంజయ్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నేలకొండపల్లి ఎస్‌ఐ సతీశ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని ఆయన చెప్పారు.

క్లుప్తంగా

ఎంబీబీఎస్ విద్యార్థికి సింగరేణి ఉద్యోగుల చేయూత


శృతికి నగదు అందజేస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలానికి చెందిన గద్దం శృతి ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి చిన్నతనంలో చనిపోగా, తల్లి కూలీ పనులకు వెళ్తూ శృతిని చదివిస్తోంది. రెండో సంవత్సరం ఫీజుతో పాటు ఇతరత్రా ఖర్చులకు ఆమె ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న కొత్తగూడెం ఏరియా పీవీకే–5 షాఫ్ట్ గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ ఉద్యోగుల వేతనం నుంచి రూ.50 చొప్పున వసూలు చేసిన రూ.35వేలు, ఎంవీటీసీ ఉద్యోగులు సమకూర్చిన రూ.37 వేలను ఏరియా జీఎం శాలేంరాజు చేతుల మీదుగా గురువారం శృతికి అందజేశారు. అధికారులు కోటిరెడ్డి, రవీందర్, పాలడుగు శ్రీనివాస్, బీవీఎస్.శర్మ, శివకేశవరావు, రమణారెడ్డి, షబ్బీర్, రామ్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో కుర్తాళం పీఠాధిపతి పూజలు


పీఠాధిపతికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ, అర్చకులు

కూసుమంచి: కూసుమంచిలోని కాకతీయుల నాటి శివాలయం(గణపేశ్వరాలయం)ను గురువారం కుర్తాళం పీఠాధిపతి, హిమాలయ సిద్ధ పరంపర గురువులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సందర్శించారు. ఆలయ అర్చకులు, ఈఓ శ్రీకాంత్ ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆతర్వాత ఆలయంలో పూజలు చేసిన స్వామి ఆలయ నిర్మాణం, విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అద్భుతమైన ఆలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని తెలిపారు.

గజలక్ష్మిగా మారెమ్మతల్లి


గజలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లి మారెమ్మతల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అమ్మవారు గురువారం గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించగా, సాయంత్రం సామూహిక కుంకుమార్చన జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కాశావజ్ఝుల రామశర్మ, మేనేజర్ ఎస్.శ్రీనివాస్, అర్చకులు గండికోట నరేందర్ శర్మ, కాశావజ్ఝుల సతీష్ శర్మ, చక్రధర్ శర్మ, వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో పరిశీలన


భీమవరంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని అయ్యవారిగూడెం, భీమవరం గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గురువారం పరిశీలించారు. ఖమ్మం ఆర్డీఓ, మధిర నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్, ఏసీపీ రవి పరిశీలించి కేంద్రాల్లో ఏర్పాట్లు, భద్రతపై సూచనలు చేశారు. ఎన్నికల కోడ్‌కు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. తహసీల్దార్ ఉషాశారద, ఎస్‌ఐ ఎం.సురేష్ పాల్గొన్నారు.

ఖమ్మం స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు


స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న రైల్వేపోలీసులు

ఖమ్మం క్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సిబ్బంది గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లోని రెండు ప్లాట్‌ఫాంలపై తనిఖీలు చేపట్టిన పోలీసులు ప్రయాణికుల బ్యాగ్‌లు, ఇతర సామగ్రిని సోదా చేశారు. సరైన పత్రాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని అవగాహన కల్పించారు. అలాగే, మద్యం, గంజాయి వంటివి రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీల్లో రైల్వే డీఎస్పీ చంద్రభాను, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వెంకటేశ్వరరావు, అధికారులు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది వారాలుగా పైసల్లేవ్ !

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- దసరా పండుగ వేళ తప్పని తిప్పలు
- భద్రాద్రి జిల్లాలో 2.32 లక్షల మంది కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

చుంచుపల్లి: భద్రాద్రి జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు పది వారాలుగా వేతనాలు అందడం లేదు. దీంతో పనులు చేసినా కనీస అవసరాలు తీరక ఇబ్బంది పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని చేసి రెండు నెలలు దాటినా వేతనాలు తమ ఖాతాల్లో జమ కాలేదని, దీంతో దసరా పండుగ ఎలా జరుపుకోవాలో తెలియడం లేదని పలువురు అంటున్నారు. పనిచేస్తేనే పూటగడిసే ఎన్నో కుటుంబాల వారు ఈజీఎస్ డబ్బు కోసం ఎదురుచూస్తున్నారు. గత ఆగస్టు నుంచి జిల్లా వ్యాప్తంగా సుమారు అందాల్సి ఉంది. ప్రతి ఏడాది లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించడంతో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు ఒకింత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఆపదలో ఆదుకుంటుందనుకున్న ఉపాధిహామీ పథకం డబ్బులు సకాలంలో అందకపోవడంతో కూలీలకు ఎదురుచూపులు తప్పడం లేదు. నిరుపేద కూలీలకు ఆసరాగా ఉంటుందని ఉపాధి పనిచేస్తే నెలలు గడుస్తున్నా వేతనాలు రాకపోవడంతో కూలీలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులు మొత్తం ఉపాధి హామీ పనులకు వెళ్లగా డబ్బుల కోసం ఎదురుచూపులే మిగిలాయి. ఉపాధి డబ్బుల కోసం క్షేత్ర సహాయకుల ఇళ్లతో పాటు మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ కూలీలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ కూలీలకు వేతన బకాయిలను దసరా పండుగలోపు ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

2.32 లక్షల మంది యాక్టివ్ కూలీలు

జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల్లో 2.21 లక్షల మంది జాబ్‌కార్డులను జారీ చేశారు. అందులో 4.59 లక్షల మందిని ఉపాధి కూలీలుగా పేరు నమోదు చేసుకున్నారు. వీటిలో ప్రస్తుతం 1.34 లక్షల జాబ్‌కార్డులు యాక్టివ్‌గా ఉండగా, వాటి పరిధిలో 2.32 లక్షల మంది యాక్టివ్ లేబర్స్‌గా పనిచేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల పరిధిలో దాదాపు 56 రకాల పనులను చేపట్టే అవకాశం కల్పించారు. వాటిలో ప్రధానంగా పంట చేలలో నీటి కుంటలు, కందకాల తవ్వకం, పూడిక తీత, పశువుల పాకలు, పంట కల్లాలు, పశుగ్రాసం పెంపకం, పండ్ల తోటలు, పొలం గట్లపై టేకు చెట్ల పెంపకం, వర్షపు నీటి మళ్లింపు కాలువలు, బంజరు భూములకు సాగుకు యోగ్యంగా మార్చడం, సీసీ రహదారులు, మట్టిరోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, నర్సరీల నిర్వహణ, హరితహారం మొక్కల సంరక్షణ వంటివి ఉన్నాయి. ఉపాధిహామీ పథకంలో పనులకు వచ్చే కూలీలకు సరాసరి రోజు గరిష్టంగా వేతనం రూ.272 వరకు చెల్లిస్తారు. జాబ్‌కార్డులో పేరు నమోదు చేసుకున్న కూలీలందరికీ నిబంధనల మేరకు 100 రోజుల పని దినాలు కల్పించాల్సి ఉంది. ఉపాధిహామీ పనులకు కేటాయించిన బడ్జెట్‌లో 60శాతం నిధులు కూలీలకు,40 శాతం నిధులను మెటీరియల్ కంపోనెంట్ కింద ఖర్చు చేస్తారు. ఇక ఈ ఏడాది ఉపాధిహామీ పథకంలో 65.91 లక్షల పనిదినాలను కల్పించాల్సి ఉండగా, ఇప్పటివరకు 34.04 లక్షల పనిదినాలను పూర్తి చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.118.04 కోట్లను ఉపాధి పనుల నిమిత్తం ఖర్చు చేశారు. ఇందులో కూలీలకు రూ.63.84 కోట్లు, మెటీరియల్‌కు రూ.49.87 కోట్లు, మరో రూ.4.33 కోట్లు ఇతర ఖర్చులకు వెచ్చించారు.

పది వారాలుగా పైసలు రావట్లే...



నేను గత పది వారాలుగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాను. ఇప్పటివరకు ఒక్కవారం పైసలు కూడా ఖాతాలో జమ కాలేదు. రోజూ అధికారులను డబ్బులు ఎప్పుడు వస్తాయని అడుగుతున్నాను. అధికారులకు అడిగితే త్వరలో వస్తాయని సమాధానం చెపుతున్నారు. ఉపాధి పైసలమీదనే కుటుంబ పోషణ ఆధారపడి ఉంది. కనీసం పండుగ వేళ అయినా డబ్బులు విడుదల చేస్తారని ఆశగా చూస్తున్నాం.

–ఎస్‌కే షబానా, ఉపాధి కూలీ, రాంపురం

త్వరలోనే జమ అవుతాయి..



జిల్లాలో ఉపాధి కూలీలకు దాదాపుగా పది వారాలుగా పనులను చేసిన వారికి కూలీ డబ్బులు రానిమాట వాస్తవం. అయితే దీనికి సంబంధించి కొన్ని కారణాల వల్ల ఈసారి కొంత ఆలస్యం అయ్యింది. ఉపాధి కూలీలు వేతనాల విషయంలో ఆందోళన చేందాల్సిన అవసరం లేదు. త్వరలోనే ఉపాధి కూలీలకు వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యే అవకాశం ఉంది.

–జి.మధుసూదన్‌రాజు, డీఆర్‌డీఓ

పాత చీరలే పంటకు రక్ష !

పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలకు రక్షణ కల్పించేందుకు పాత చీరలను కొనుగోలు చేసి పొలాల చుట్టూ కడుతున్నారు. పంటలను ధ్వంసం చేస్తున్న ఆవులు, గేదెలు, కోతుల బారి నుంచి ఇలా కాపాడుకుంటున్నారు. ఇలా పంట చుట్టూ కోకలు ఏర్పాటుచేసిన దృశ్యాలు చర్ల మండలంలోని పలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి. అటుగా వెళ్లేవారు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. – చర్ల


కుదునూరు పంచాయతీ బోటిగూడెంలో వరి పంటకు రక్షణగా కట్టిన చీరలు

రూ.7.82 కోట్ల లాభాల్లో ఖమ్మం రీజియన్

- జనవరికల్లా డిపోలకు కొత్త బస్సులు
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న


అవార్డులు అందుకున్న ఉద్యోగులతో రీజినల్ మేనేజర్ వెంకన్న, డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోలు గతేడాదితో పోలిస్తే నష్టాలను అధిగమించి ఈ ఏడాది రూ.7.82 కోట్ల లాభాలు సాధించాయని రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న వెల్లడించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఏర్పాటుచేసిన మోడ్రన్ వాషింగ్ ప్లాంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలువురు ఉద్యోగులకు ఆర్టీసీ ప్రగతిచక్రం అవార్డులు అందజేశాక ఆర్‌ఎం మాట్లాడారు. రీజియన్ గతేడాది రూ.11 కోట్ల నష్టాలలో ఉండగా... ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నష్టాలను అధిగమించి లాభాల బాట పట్టాయని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితోనే లాభాలు వస్తున్నాయని, గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌లో భాగంగా ఆర్టీసీకి రాబోయే వంద రోజులు కీలకమని స్పష్టం చేశారు. దసరా, దీపాళి, సంక్రాంతి పండుగల వేళ ప్రయాణికులను క్షేమంగా స్వగ్రామాలకు చేర్చి అధిక ఆదాయం గడించేందుకు ఉద్యోగులు అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. కాగా, జనవరి కల్లా జిల్లాలోని 90 పాత ఎక్స్‌ప్రెస్ బస్సుల స్థానంలో కొత్తవి వస్తాయన్నారు. సత్తుపల్లి నుంచి ఖమ్మంకు రెండు బస్సులతో 12 ట్రిప్పులు అదనంగా పెంచినట్లు ఆయన తెలిపారు. ఇక వారంలోగా జుల్లో మరో రాజధాని బస్సు చేరుకుంటుందని, రీజియన్‌లోని అన్ని బస్‌స్టేషన్లకు ప్రహరీలు నిర్మిస్తుండగా తల్లాడ బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఆర్‌ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సాహిధి, వెల్ఫేర్ బోర్డు సభ్యులు కిరణ్‌బాబు, రేణుక, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు


ఎన్నికల నినాదాలతో కూడిన ముగ్గులు వేస్తున్న ఉద్యోగులు (ఇన్‌సెట్) విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం కలెక్టరేట్‌లో వినూత్న రీతిలో చేపట్టిన బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మూడో రోజైన గురువారం మహిళా ఉద్యోగులు సంబరంగా జరుపుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బతుకమ్మల వద్ద ఓటర్ల కు అవగాహన కల్పించేలా ఎన్నికల లోగో, సీ విజిల్ యాప్ బొమ్మలే కాక నినాదాలు రాశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీరామ్, డీఆర్డీఓ విద్యాచందన, డీడబ్ల్యూఓ సుమ, డీపీఓ విజయనిర్మల, డీసీఓ విజయకుమారి, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ పాల్గొన్నారు.

ఐదో షెడ్యూల్‌ను కాపాడుకునేందుకు ఎన్నికల్లో పోటీ


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

ఇల్లెందు: దేశవ్యాప్తంగా ఆదివాసీలు పోరాడి సాధించుకున్న ఐదో షెడ్యూల్‌లోని హక్కులతో పాటు 1/70 చట్టం, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్నామని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య తెలిపారు. ఎస్టీ స్థానాల్లో ఇతర గిరిజన సంఘాలతో కలిసి పోటీ చేస్తామని వెల్లడించారు. ఇల్లెందులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 ఎస్టీ స్థానాల్లోతుడుందెబ్బ, గోండ్వానా సంక్షేమ పరిషత్, నాయకపోడు సంఘం, నంగారాభేరి, ఏరుకల సంఘంతో ఏర్పడిన ఐక్యవేదిక పోటీలో నిలుస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు వట్టం ఉపేందర్, పాయం సత్యనారాయణ, భూక్యా రాజేష్‌నాయక్, కొమరం బుచ్చయ్య, బద్రినాయక్, వట్టం కన్నయ్య, ధనసరి రామ్మూర్తి, వర్ష శ్రీనివాస్, ఈసాల రామచంద్రు, దుర్గారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ నరమేధంపై నిరసనలు తెలపండి

ఖమ్మంమయూరిసెంటర్: అమెరికా అండ చూసుకొని పాలస్తీనాపై ఇజ్రాయిల్ దుర్మార్గంగా దాడులు చేస్తోందని, ఈ దాడులపై అన్నివర్గాల ప్రజలు నిరసన తెలపాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో కోరారు. పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధాన్ని నిరసిస్తూ ఈనెల 20న జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. గజాలోని పాలస్తీనా ప్రజలు ఖాళీ చేశాక ఆ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమిస్తుందని మండిపడ్డారు. ఇకనైనా ఇజ్రాయిల్‌ను ఐరాస అడ్డుకుని పాలస్తీనాను స్వతంత్ర రాజ్యాన్ని గుర్తించాలని రంగారావు డిమాండ్ చేశారు.

పిల్లలే సాక్ష్యం... మీ ఓట్లు మాకే!



ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి వసంతలక్ష్మి గురువారం పలు డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గట్టయ్య సెంటర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తుండగా ద్విచక్రవాహనంపై కవల పిల్లలతో వెళ్తున్న వారిని కలిసి మాట్లాడారు. చిన్నారుల వివరాలు తెలుసుకున్న ఆమె వాహనంపై ఉన్న ఇద్దరిని ఓట్లు పువ్వాడకే వేయాలని కోరారు. – ఖమ్మంమయూరిసెంటర్

బలగాలు రెడీ!

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరోపక్క బందోబస్తు నిమిత్తం ఏపీలోని విజయనగరం నుండి కేంద్ర బలగాలు గురువారం వైరాకు చేరుకున్నాయి. వైరాలోని కేవీసీఎం డిగ్రీ కళాశాలలో వీరికి బస ఏర్పాటుచేయగా.. ఎన్నికలు ముగిసే వరకు వీరు స్థానికుల పోలీసులతో కలిసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించనున్నారు. కేంద్ర బలగాల కమాండెంట్ కులదీప్ పర్యవేక్షణలో ఈ బెటాలియన్ విధులు నిర్వర్తించనుంది. వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, ఎస్‌ఐ ప్రసాద్ తదితరులు కమాండెంట్‌తో నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. – వైరా



అసంతృప్త నేతలతో పువ్వాడ భేటీ


నాయకులతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక సమస్యలు సహా వర్గాల మధ్య గొడవల నేపథ్యాన కొందరు బీఆర్‌ఎస్ నేతలు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వీరిని బుజ్జగించే ప్రయత్నంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నిమగ్నమయ్యారు. మండలంలోని కోయచలక, రేగులచలక గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల కాంగ్రెస్ నాయకుడు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ కలిసి మంతనాలు చేశారు. పార్టీ మారేందుకు సిద్ధమని చెప్పినట్లు తెలిసింది. దీంతో మంత్రి గురువారం బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్, వార్డుసభ్యులను కలిసి గతంలో జరిగినవి మరిచిపోండి... ఇక అన్నీ తానే చూసుకుంటా, అందరికీ న్యాయం చేస్తానని భరోసా కల్పించారు. వచ్చే ఎన్నికల్లో తన గెలుపు బాధ్యత తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ వడ్డే ప్రసాద్, వార్డుసభ్యుడు యండపల్లి సత్యం తదితరులను మంత్రి కలవగా సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్‌తో పాటు పిన్ని కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఓటుతోనే బీజేపీకి బుద్ధి చెబుతాం

- టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి విస్మరించిన బీజేపీకి రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతామని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దకాలంగా వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేస్తున్న బీజేపీకి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దేశంలోని అనేక క్లిష్టతరమైన సమస్యలను వారికి, వారి పార్టీ విధానాలకు అనుగుణంగా మార్చుకుంటూ వర్గీకరణ విషయంలో మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం మాదిగలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అణగారిన వర్గాలను మరింత అట్టడుగు స్థాయికి నెడుతున్న బీజేపీకి అంబేద్కర్ ఇచ్చిన ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పడానికి మాదిగలు సిద్ధం కావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈసమావేశంలో టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పేర్ల మధు, నాయకులు లంక వెంకటేశ్వర్లు, పడిశాల వెంకన్న, శ్యాం, హెచ్.వెంకటేశ్వర్లు, మోదుగురాజు, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే దళితబంధు

- కేంద్ర మంత్రి నారాయణస్వామి


మాట్లాడుతున్న కేంద్రమంత్రి నారాయణస్వామి

మధిర: హుజూరాబాద్ ఉప ఎన్నికలో గెలిచేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకం తీసుకొచ్చారని కేంద్ర సామాజిక, న్యాయశాఖ మంత్రి నారాయణ స్వామి ఆరోపించారు. మధిరలో గురువారం జరిగిన బీజేపీ పోలింగ్‌బూత్ కమిటీల సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న కేసీఆర్ అధికారంలోకి వచ్చాక మాట తప్పారని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు నాలుగు గంటల పాటు సక్రమంగా ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు తేలితే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాను సెల్యూట్ చేస్తానని చెప్పారు. దేశాన్ని 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఓబీసీలకు అధికారం ఇవ్వలేదని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసేది నరేంద్రమోదీనేనని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ప్రధానమంత్రి దక్కుతుందని తెలిపారు. ఈమేరకు డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేలా తెలంగాణలో కూడా బీజేపీని ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వ్యవసాయ పాలిటెక్నిక్ క్రీడలు

- పలు విభాగాల్లో మధిర జట్టు ప్రతిభ


మధిర క్రీడాకారులతో అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలబాలికల విభాగాల నుంచి మధిర కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగం షాట్‌పుట్‌లో రెండో బహుమతి, క్విజ్‌లో మూడో బహుమతి సాధించారు. అలాగే, బాలికల విభాగం చెస్‌లో రెండో బహుమతి, లాంగ్‌జంప్‌లో మూడో స్థానం, వ్యాసరచన పోటీల్లో మొదటి, క్విజ్‌లో మూడో స్థానం, సోలో డ్యాన్స్‌లో మొదటి స్థానం, గ్రూప్ డ్యాన్స్‌లో మొదటి స్థానం, కల్చరల్, లిటరరీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలవడం విశేషం. ఈ సందర్భంగా విజేతలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ డీన్ డాక్టర్ సీమా బహుమతులు అందజేసి అభినందించారు. వ్యవసాయ కోర్సులతో ఉపాధి పొందడంతో పాటు రైతులకు సేవ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జగిత్యాల పాలిటెక్నిక్ డైరెక్టర్ పద్మజ, క్రీడల పరిశీలకుడు సురేష్, వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతినారాయణ్ భట్ తదితరులు పాల్గొన్నారు.